క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి చేయూత



బాండ్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడులో గల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1990–91లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమతో పాటు కలిసి చదువుకున్న బొడ్డు శ్రీనివాసరావు మృతి చెందడంతో అతని కుటుంబానికి చేయూతనందించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.75 వేలు సేకరించారు. శ్రీనివాసరావు పిల్లల చదువు నిమిత్తం రూ. 50 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్‌ను బుధవారం అతని కూతురుకు అందజేశారు. అదేవిధంగా వారు చదువుకున్న పాఠశాలకు రూ.15 వేల విలువ గల బీరువా, ఫర్నిచర్‌ను బహూకరించారు. అంతేకాకుండా గ్రామంలోని గ్రంథాలయానికి రూ.10 వేల విలువ గల ఫర్నిచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కందిమండ నరసింహారావు, విప్పర్ల శ్రీనివాస్, కొండా జయపాల్‌రెడ్డి, మేకల రామారావు, చింతకాయల బ్రహ్మయ్య, పాతకుంట్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నేరేడుచర్ల : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని బక్కయ్యగూడెంలో చోటుచేసుకుంది. వివరాలు.. గరిడేపల్లి మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన బచ్చు మట్టయ్య గేదెను మేత కోసం విడిచిపెట్టగా మండలంలోని బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన ముత్తినేని వెంకన్న పొలంలో తెగిపడి ఉన్న ఎల్‌టీ విద్యుత్ లైన్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో వారం రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను బుధవారం ఎంపీడీఓ జానకిరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా మఠంపల్లి, పెదవీడు, చౌటపల్లి, అల్లీపురం తదితర గ్రామాలలో జేసీబీలతో చెత్త డంపింగ్, పైపులైన్ల లీకేజీల మరమ్మతుల పనులను ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించారు. ఎంపీఓ అంజనేయులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులున్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి



కోదాడరూరల్: విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ అధికారులు



గరిడేపల్లి : గడ్డిపల్లిలో విత్తనాల దుకాణాన్ని పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కోదాడరూరల్ : రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి దుకాణదారులను హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలను వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. వచ్చే వానాకాలం సీజన్‌లో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారని వారికి డీలర్లు పేరున్న, నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. డీలర్లు విత్తన, చట్టం ప్రకారమే విత్తనాలు కొనుగోలు చేసి నిల్వ చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో ఏడీఏ వాసు, సీఐ ఆంజనేయులు, ఏఓ రజిని, ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు ఉన్నారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

గరిడేపల్లి : విత్తనాల దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ బృందం హెచ్చరించింది. బుధవారం గరిడేపల్లి, గడ్డిపల్లి గ్రామాల్లో గరిడేపల్లి ఎస్‌ఐ వెంకటరెడ్డి, వ్యవసాయశాఖ అధికారి ప్రియతమ్‌తో కలిసి టాస్క్‌ఫోర్స్ బృందం విత్తన దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నాణ్యతతో కూడిన విత్తనాలను అందించాలని చెప్పారు. మండలంలో ఎవరైన నకిలి విత్తనాలు విక్రయిస్తే టాస్క్‌ఫోర్స్ బృందానికి సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. వీరి వెంట టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

పాలకవీడు : నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి రాజు, ఎస్సై సైదులు హెచ్చరించారు. బుధవారం మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను వారు తనిఖీ చేశారు. వానాకాలం సీజన్‌లో రైతులకు విక్రయించడానికి సిద్ధం చేసిన విత్తనాలు, ఎరువులను, స్టాక్ రిజిస్టర్లను వారు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. ప్యాకింగ్ తీసిన విత్తనాలు, గడువు ముగిసిన విత్తనాలు విక్రయించవద్దన్నారు. దుకాణాల ఎదుట స్టాక్, ధరలు, విత్తన రకాలు వివరాలను తెలిపే పట్టికను ఏర్పాటు చేయాలన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

మునగాల : వానాకాలం సీజన్‌లో రైతాంగానికి నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్‌ఐ పిల్లి లోకేష్, మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు విక్రయించే విత్తనాలకు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం వాయిదా

కోదాడరూరల్ : మండలంలోని అడ్లూరు సర్పంచ్‌పై పెట్టిన అవిశ్వాసం బుధవారం వాయిదా పడింది. ఆర్డీఓ కిషోర్‌కుమార్‌కు జ్వరం రావడంతో ఆయన రానందున తీర్మానాన్ని వాయిదా వేసిన్నట్లు ఇన్‌చార్జ్ కార్యదర్శి తెలిపారు. తమకు లిఖితపూర్వకంగా తెలియపరిస్తేనే వాయిదాకు ఒప్పుకుంటామని వార్డు సభ్యులు కార్యదర్శితో వాగ్వివాదానికి దిగి బయటకు వెళ్లకుండా పంచాయతీ కార్యాలయం గేటుకు తాళం వేశారు. దీంతో ఆర్డీఓ నుంచి వాయిదా వేస్తున్నట్లు నోటీసులు రావడంతో వారు వెళ్లిపోయారు. తిరిగి అవిశ్వాస తీర్మానం ఎప్పుడు పెట్టేది మూడు నాలుగు రోజుల్లో నోటీసుల ద్వారా తెలియజేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో ముందస్తుగా 144 సెక్షన్ అమలు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైద్యసిబ్బంది సేవలు అభినందనీయం



వైద్యసిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ రమ్య

హుజూర్‌నగర్‌రూరల్ : వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమని సర్పంచ్ పత్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని శ్రీనివాసపురంలో కంటి వెలుగు శిబిరం ముగింపు సందర్భంగా వైద్య సిబ్బందిని ఆమె సన్మానించారు.కోఆర్డినేటర్ ఉదయగిరి శ్రీనివాస్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి ప్రభాకర్, ఇందిరాల రామకృష్ణ, డాక్టర్ మంగ, సిబ్బంది జయంతి, అశోక్, విజయలక్ష్మి, అలివేలుమంగ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఫస్ట్ ర్యాంకర్‌కు సన్మానం

హుజూర్‌నగర్ : ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన హుజూర్‌నగర్‌కు చెందిన విద్యార్థిని సీఎస్‌వీ వైష్ణవిదేవిని బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ నాయకులు శాలువ, పూలమాలతో సత్కరించారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, పశ్య శ్రీనివాసరెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, గుండా రమేష్, కేవీఎస్ మూర్తి, సూర్యనారాయణ, జడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

కార్యకర్తలను ఆదుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ

హుజూర్‌నగర్ : బీఆర్ఎస్ కార్యకర్తలను పార్టీ ఎల్లవేళలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు వేజెండ్ల ప్రసాద్, అల్వాల లక్ష్మి ఇటీవల వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. దీంతో వారికి మంజూరైన రూ.2 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను బుధవారం వారి నామినీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, గెల్లి రవి, అమర్ గౌడ్, ప్రదీప్, కిరణ్‌కుమార్, రామకృష్ణ, శరత్ కుమార్, యడ్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్-2023 మండల స్థాయి పోటీలు

హుజూర్‌నగర్ : చీఫ్ మినిస్టర్ కప్ – 2023 టోర్నమెంట్‌లో భాగంగా చింతలపాలెంలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ముగిసాయి. ఈ పోటీలలో కబడ్డీ మొదటి బహుమతిని చింతలపాలెం జట్టు, వాలీబాల్ మొదటి బహుమతిని కిష్టాపురం జట్టు, ఖోఖో మొదటి బహుమతిని కొత్తగూడెం జట్టు గెలుపొందారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.వెంకటరెడ్డి, ఎంపీడీఓ జె.శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ సైదానాయక్, తహసీల్దార్ వాజిద్, ఎంపీఓ శ్రీనివాసరావు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు .

మాజీ సర్పంచ్ అంకిరెడ్డికి నివాళి



మఠంపల్లి : అంకిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, కుటుంబసభ్యులు, తదితరులు

మఠంపల్లి : మండలంలోని గుండ్లపల్లి మాజీ సర్పంచ్, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తండ్రి శానంపూడి అంకిరెడ్డి 25వ వర్ధంతిని బుధవారం స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే, కుటుంబసభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తల్లి మాజీ సర్పంచ్ శానంపూడి సత్యావతి, మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీలు చంద్రకళ, సైదిరెడ్డి, ఎంపీటీసీ సైదిరెడ్డి, హుజూర్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, కె.వెంకటరెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, హాఫీజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తండ్రి అంకిరెడ్డి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే తమ కుటుంబసభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్, కౌన్సిలర్ వై.గురువయ్య, నాయకులు మధు, సాయిరాంగౌడ్, పిపి శంకర్‌రెడ్డి, నర్సింగ్ వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, నరసింహారావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పశ్య రామిరెడ్డి సేవలు మరువలేనివి



రామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : సీపీఐ నాయకుడు పశ్య రామిరెడ్డి సేవలు మరువలేనివని ప్రియదర్శిని విద్యా సంస్థల అధినేత పశ్య శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పశ్య రామిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, నాయకులు కేవీఎస్ మూర్తి, గుండు వెంకటేశ్వర్లు, కొప్పోజు సూర్యనారాయణ, వై.రమేష్, జి.రమేష్, డి.సత్యనారాయణ, ఎ.పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మెప్మా సిబ్బందికి దిశానిర్దేశం

నేరేడుచర్ల : మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి జూన్ 5 వరకు వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థుల సహకారంతో పాత పేపర్లు, పుస్తకాలు, ప్లాస్టిక్ సామగ్రి, అల్యూమినియం, రబ్బర్, దుస్తులు, థర్మకోల్, పనికిరాని ఆటబొమ్మలు సేకరించి రెడ్యూస్ వేస్ట్, రీసైకిల్ వేస్ట్ కేంద్రాలకు తరలించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. మేనేజర్ అశోక్‌రెడ్డి, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉపాధి కూలీలకు పేస్లిప్‌లు ఇవ్వాలి

మునగాల : ఉపాధి హామీ కూలీలకు పేస్లిప్ ఆధారంగా వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. బుధవారం మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సొంపంగు జానయ్య, సరికొండ నాగరాజు, రాములు, మల్లయ్య, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

నేరేడుచర్ల : ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని బీఎస్పీ జిల్లా కన్వీనర్ రాపోలు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వైకుంఠాపురంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకొని మాట్లాడారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు నాగార్జున, వెంకటేశ్వర్లు, రాములు, వెంకన్న ఉన్నారు.

కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శం

గరిడేపల్లి : కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీడీఓ వనజ, సర్పంచ్ కుక్కడపు జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని తాళ్లమల్కాపురం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఎంపీఓ మౌలానా, ఎంపీటీసీ బాణోతు రాములు, కార్యదర్శి నర్సరాజు, మహేష్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

మఠంపల్లి : ప్రతిఒక్కరూ కంటి వెలుగు పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ పార్వతీకొండానాయక్ కోరారు. బుధవారం మండలంలోని అవిరేణికుంట తండాలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ బానోతు విజయ, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ అంజనేయులు, ఉపసర్పంచ్ చీనానాయక్, వైద్య బృందం పాల్గొన్నారు.